క్లుప్తంగా

పచ్చదనం.. మేకలకు ఆహారం



సత్తెనపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేస్తుంటే సత్తెనపల్లిలో మాత్రం పచ్చదనం కాస్త మేకలకు, ఆవులకు ఆహారంగా మారుతుంది. పట్టణంలోని ప్రధాన రహదారిలో సెంట్రల్ డివైడర్‌పై ఏర్పాటు చేసిన మొక్కలకు ఎలాంటి రక్షణ లేక పోవడంతో ఆవులు, మేకలు మేస్తున్నాయి. సెంట్రల్ డివైడర్ మొత్తం ఓ పక్క ప్రచార బోర్డులతో నిండిపోగా.. మరోవైపు మేకలు, ఆవులు మేయడంతో మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా తయారవుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ప్రధాన రహదారిలోని సెంట్రల్ డివైడర్‌పై ప్రచార బోర్డులను కూడా తొలగించి పచ్చదనం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా విశ్వేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్టా మహోత్సవం



ఉయ్యందన(క్రోసూరు): మండలంలోని ఉయ్యందన గ్రామంలో గురువారం గంగా పార్వతి సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్టా మహోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు అశేషంగా హాజరయ్యారు. ఆలయ అర్చకులు గుండెపూడి లక్ష్మీనరసింహ శాస్త్రి, గుండెపూడి నాగరాజశేఖర శర్మ ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. ఆలయంలో గణపతి, అమ్మవారు, నవగ్రహాలు, నందీశ్వరుడు, ధ్వజ స్తంభం, కాలభైరవుడు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవారు, దక్షిణామూర్తి, లక్ష్మీనారాయణ, చండీ కేశ్వరస్వామి వార్లు, ఆలయ గోపుర శిఖర కలశములు, యంత్ర సహితంగా ప్రతిష్టించటం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బావిలో పడి పోస్టుమాస్టర్ మృతి



పెదకూరపాడు : నేల బావిలో పడి పోస్టు మాస్టర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన పెదకూరపాడు మండలం రామాపురం గ్రామంలో గురువారం కలకలం రేపింది. ఎస్సై గిరిబాబు తెలిపిన వివరాల మేరకు మేడికొండూరు గ్రామానికి చెందిన మస్తాన్ సాదిక్ (28) మండల పరిధిలోని రామాపురం బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. రోజువారి విధులకు హాజరైన సాదిక్ బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతి చెందాడు. స్థానికులు బావిలో మృతదేహం తేలుతుండటం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి తరలించినట్లు ఎస్సై గిరిబాబు తెలిపారు. ఘటనపై కుటుంబ సభ్యులు ఎటువంటి ఫిర్యాదు ఇవ్వలేదన్నారు.

జిమ్ చేసి.. కుప్పకూలి వ్యక్తి మృతి

వినుకొండ : పట్టణంలో ఓ జిమ్ సెంటర్‌లో గురువారం ఉదయం జిమ్ చేసి బయటకు వచ్చి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన శ్రీను అలియాస్ కిచిడి శ్రీను ఉదయాన్నే జిమ్ చేయడానికి వచ్చి జిమ్ అనంతరం వెయిట్ చెక్ చేసుకున్నాడు. అనంతరం బయటకు వెళ్లే క్రమంలో డోర్ దగ్గరే ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. కింద పడుతున్న శ్రీనుని గమనించిన జిమ్ నిర్వాహకులు వెంటనే పట్టుకున్నారు. సభ్యుల సహాయంతో ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స అందించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లభించలేదని గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని జిమ్ నిర్వాహకులు తెలిపారు. జరిగిన సంఘటన మొత్తం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది.

సేంద్రియం.. భూమి సారం

- పశువుల ఎరువుతో ఎంతో ప్రయోజనం
- సేంద్రియ ఎరువుకు పెరిగిన డిమాండ్
- రైతులకు సూచిస్తున్న వ్యవసాయాధికారులు



పొలంలో కుప్పలుగా పోసిన పశువుల ఎరువు

బెల్లంకొండ: రసాయనిక మందులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని ఓ వైపు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు చెబుతున్నా రైతులు పట్టించుకోవడం లేదు. ఏటా పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమిలో సారం తగ్గిపోయి పండించిన ధాన్యాలు విషతుల్యమవుతున్నాయి. దీంతో రసాయనిక మందుల వాడకం తగ్గించడానికి వ్యవసాయాధికారులు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. సేంద్రియ వ్యవసాయంపై తరచూ అవగాహన సదస్సులు నిర్వహించి, రైతుల్లో మార్పు తీసుకురావడానికి వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది.

దిగుబడులు అధికం

రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడడంతో భూమి సహజత్వాన్ని కోల్పోయి పంటలు పండడం లేదు. పెట్టుబడి ఖర్చులు ఏటా పెరగుతుండడంతో వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలూ ఉన్నాయి. సేంద్రియ వ్యవసాయంతో పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా దీర్ఘకాలం స్థిరంగా, ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చు.

పురుగు మందులను తగ్గించాలి

ప్రస్తుతం వ్యవసాయంలో పురుగు మందుల వాడకం ఎక్కువగా ఉండడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం జీవరాసులు కూడా అదే స్థాయిలో చనిపోతున్నాయి. ప్రపంచంలో 40 శాతం భూమి ఇప్పటికే సత్తువ కోల్పోయి ఎందుకూ పనికి రాకుండా పోయిందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పురుగు మందులతో పండించిన ఆహారం తీసుకుంటే గుండె జబ్బులు, కేన్సర్ వంటి దీర్ఘకాలిక జబ్బులు పెరుగుతున్నాయి. పంటలకు మేలు చేసే తూనీగలు, సాలీడు, కందిరీగలు, అక్షింతల పురుగులు వంటి మిత్ర పురుగులు చనిపోతున్నాయి. రసాయనిక మందుల వాడకం ఇలాగే కొనసాగిస్తే నేల, నీరు, గాలి.. చివరకు పర్యావరణాన్ని కలుషితం చేస్తుందని శాస్త్రవేత్తలు వాపోతున్నారు.

ప్రతి రైతుకూ ఆవులు, గేదెలు, ఎద్దులు అధికంగా ఉండేవి. పేడను ఎరువుగా పంటలకు ఉపయోగించే వారు. ప్రతి గ్రామంలో మేకలు, గొర్రె మందలు బాగా ఉండేవి.

సేంద్రియ ఎరువుకు డిమాండ్

నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం ఏ పంటకైనా రసాయనిక మందులను ఉపయోగిస్తున్నారు. పశువుల ఎరువులను వాడడం వల్ల భూమి సారవంతంగా ఉంటుంది. పండ్ల తోటల రైతులు రసాయనిక మందులు కాకుండా సేంద్రియ ఎరువులను ఉపయోగించడానికి ఆసక్తి చూపుతున్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చునని రైతులు ఆశిస్తున్నారు. దీంతో సేంద్రియ ఎరువుకు డిమాండ్ పెరుగుతోంది.

- భూ సారాన్ని కాపాడడానికి ఎప్పుడూ ఒకే పంటను కాకుండా వివిధ రకాల పంటలతో పంట మార్పిడి చేయాలి. పంటలకు కావాల్సిన పోషకాలను కంపోస్టు ఎరువుల ద్వారా జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పైరును పొలంలో పెంచి కలియదున్నడం వల్ల పంటలకు పోషకాలను అందించవచ్చు. సేంద్రియ ఎరువులైన వేరుశనగ చెక్క, ఆముదం చెక్క, కానుగ చెక్క, వేప పిండి లాంటివి విరివిగా వాడాలి.

పశు పోషణ భారం

సేంద్రియ ఎరువులను పొలంలో వేసి పంటను సాగు చేస్తే పంట ఏపుగా పెరగడమే కాక మంచి దిగుబడులు వస్తాయి. గతంలో ఖరీఫ్ ప్రారంభమయ్యిందంటే ఎడ్ల బండ్లలో ఎరువులను పొలాలకు తోలుకునే వాళ్లం. పశుగ్రాసం కొరతతో పశువులను పోషించుకోవడం భారమవుతోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో పంటలకు సేంద్రియ ఎరువులు కాకుండా రసాయనిక మందులనే ఎక్కువ మంది వాడుతున్నారు.

– బద్దూరి వెంకట్రామిరెడ్డి, రైతు, నాగిరెడ్డిపాలెం

అవగాహన కల్పిస్తున్నాం

తరచూ రసాయనిక మందుల వాడకం వల్ల తినే ఆహారం విషతుల్యం అవుతుంది. రసాయనిక మందుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై గ్రామాలలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు సేంద్రియ వ్యవసాయం చేసుకుంటే అధిక దిగుబడులను సాధించవచ్చు.

– డి.కృష్ణయ్య, మండల వ్యవసాయాధికారి, బెల్లంకొండ



సేంద్రియ ఎరువును పొలానికి తీసుకెళ్తున్న రైతు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఇండియన్ యోగా అసోషియేషన్ కన్వీనర్ శ్రీనివాస్



బెల్లంకొండ: సంపూర్ణ ఆరోగ్యం యోగా ద్వారానే సాధ్యమవుతుందని ఇండియన్ యోగా అసోసియేషన్ కన్వీనర్ పతంజలి శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 'యోగాంధ్ర– ఆయుష్ గ్రామం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ శాఖల అధికారులు సిబ్బందికి యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యజీవితంలో యోగా ప్రాముఖ్యతను పతంజలి శ్రీనివాస్ వివరించారు. అనంతరం వివిధ ఆసనాలను, యోగాను సిబ్బందితో చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసనాయక్, తహసీల్దార్ అష్రపున్నీసా బేగం, మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య, ఎంఈవో రాజకుమారి, ఈవోపీఆర్‌డీ వెంకటగిరి రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ముప్పాళ్ల: మండలంలోని లంకెలకూరపాడు గ్రామానికి చెందిన మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన 16 సంవత్సరాల మైనర్ బాలిక ఈ నెల 17వ తేదీన ఇంటి నుంచి వెళ్లి కనిపించక పోవడంతో తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భజే.. వాయుపుత్రం

- భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు





మల్లాది ధ్యానాంజనేయస్వామిని దర్శించుకున్న నంబూరు శంకరరావు తదితరులు



అచ్చంపేటలోని 30 అడుగుల అభయాంజనేయస్వామి

అమరావతి: హనుమత్ జయంతి సందర్భంగా గురువారం మండలంలోని గ్రామాలలో ఆంజనేయస్వామి ఆలయాలు, విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు, ఆకు పూజలు, హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించి వడమాలలు స్వామి వారికి సమర్పించారు.

మల్లాదిలో...

మండల పరిధిలోని మల్లాదిలో హనుమజ్జయంతి సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకుడు పరుచూరి వెంకట రమణాచార్యులు, ఆలయ ధర్మకర్త భవిరిశెట్టి హనుమంతరావు ఆధ్వర్యంలో 40 అడుగుల అభయాంజనేయ స్వామికి ప్రత్యేకంగా తమలపాకుల పూజలను నిర్వహించారు. అనంతరం ధ్యానాంజనేయస్వామికి సహస్ర నామాలతో తమలపాకులతో ఆకు పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ పూజా కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు అలా లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాయుడు సాంబశివరావు, పార్టీ అధికార ప్రతినిధి అన్నపాములు, నాయకులు వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు, కోట హరిబాబు, ఈదా సాంబిరెడ్డి, మంగిశెట్టి కోటేశ్వరరావు, నంబూరు బాబురావు, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, వీరరాఘవయ్య, అలపాటి వీరయ్య, కొండవీటి కోటేశ్వరరావు, షేక్ హాష్మీ, బెల్లంకొండ మీరయ్య, నండూరి కరుణకుమార్, నాయుడు రాంబాబు, వెంపా వాసు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నంబూరు శంకరరావుకు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు.



గోళ్ళపాడులోని ప్రసన్నాంజనేయస్వామి

అమరావతిలో...

పుణ్యక్షేత్రమైన అమరావతి పవిత్ర కృష్ణానదీ తీరాన అభయాంజనేయస్వామి ఆలయం, మెయిన్ రోడ్‌లోని కోదండరామాలయంలోని అభయాంజనేయునికి వేకువజామున పంచామృత స్నపన నిర్వహించి విశేషాలంకారం చేశారు. కోదండరామాలయంలో పరాశరం రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో గత 40 రోజులుగా వాసవీ మహిళా మండలి సభ్యులు హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహిస్తున్నారు. హనుమజ్జయంతి సందర్భంగా గురువారం 108 సార్లు పారాయణతో ముగించారు. ఆంజనేయస్వామి వారికి 20 మంది దంపతులు ఆకుపూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు విసనకర్రలు, మామిడిపండ్లను పంపిణీ చేశారు. అమరేశ్వరాలయంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈవో రేఖ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- మండల పరిధిలోని లేమల్లెలో ఆంజనేయస్వామికి నిర్వాహకుడు బంధం రావూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. ఎండ్రాయి ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో మన్యుసూక్త హోమం, లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. వైకుంఠపురం, ఎండ్రాయి, దిడుగు, అత్తలూరు తదితర గ్రామాలలోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నకరికల్లులో...

నకరికల్లు: మండలంలోని ప్రముఖ ఆలయాల్లో హనుమత్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. చల్లగుండ్లలోని ఆంజనేయస్వామి ఆలయం, నకరికల్లులోని వృక్షాంజనేయ స్వామి, అడ్డరోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయం, చీమలమర్రి, దేచవరం గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. లక్ష తమలపాకులతో అర్చనలు చేసి విశేషంగా అలంకరించారు. చల్లగుండ్లలోని ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వృక్షాంజనేయస్వామి ఆలయంలో భజన బృందంచే హనుమాన్ చాలీసా పారాయణం గావించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

ముప్పాళ్లలో...

ముప్పాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గోళ్ళపాడులోని ప్రసన్నాంజనేయస్వామి, ముప్పాళ్లలోని ఆంజనేయస్వామి, చాగంటివారిపాలెంలోని వీరాంజనేయస్వామి విగ్రహం వద్ద, కుందురువారిపాలెంలోని సాందీపని ఆశ్రమంలోను స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించారు. స్వామి వారికి ఆకుపూజలు, సహస్ర నామార్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



చల్లగుండ్లలో ఆంజనేయస్వామి వారికి లక్ష తమలపాకులార్చన చేస్తున్న అర్చకులు



వృక్షాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్‌చాలీసా పారాయణలో భక్త బృందం

అచ్చంపేటలో...

అచ్చంపేట: మండలంలో గ్రామ గ్రామాన హనుమజ్జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని 30 అడుగుల అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, భజన కార్యక్రమాలు చేపట్టారు. స్వామి వారికి అష్టోత్తర శతనామార్చనలతో పూజలు నిర్వహించారు. భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. స్థానిక సాయిబాబా దేవాలయం ముందు గల పంచముఖ ఆంజనేయస్వామికి షిరిడీసాయి, సత్యసాయి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోగంటివారిపాలెం పాటిమీద ఆంజనేయ స్వామికి జరిగిన ప్రత్యేక పూజలలో పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం హనుమజ్జయంతి వేడుకలను భక్తులు వైభవంగా జరుపుకున్నారు. మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం, వెంకటాయపాలెం, చంద్రాజుపాలెం, పాపాయపాలెం, కందిపాడు, నాగిరెడ్డిపాలెం, గ్రామాలలోని ఆంజనేయ స్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామి వారికి పొంగళ్లు చేసి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: మండల వ్యాప్తంగా హనుమజ్జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెదకూరపాడు, కాశిపాడు, లింగంగుంట్ల, 75 తాళ్లూరు, హుస్సేన్ నగరం, బుచ్చయ్యపాలెం గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాలు, విగ్రహాలకు పలు రకాల పుష్పాలు, తమల పాకులతో స్వామి వారిని అలంకరించి విశేషంగా పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పఠనం చేశారు. ఆలయ గురువులు హనుమాన్ చాలీసా విశిష్టతను భక్తులకు వివరించారు. ఆలయ నిర్వహణ కమిటీల ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేపట్టారు.



మేదర మహేంద్ర సంఘ రామాలయం వద్ద పూజల్లో సీఐ నాగమల్లేశ్వరరావు

సత్తెనపల్లిలో హనుమజ్జయంతి



సత్తెనపల్లిలోని మహారాష్ట్ర వీధిలో...




త్రిశక్తిదుర్గాపీఠంలో...

సత్తెనపల్లి: హనుమజ్జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని వివిధ వార్డులు, మండలంలోని పలు గ్రామాల్లో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్న సంతర్పణలు నిర్వహించారు. నారాయణ నగర సంకీర్తన వారి ఆధ్వర్యంలో పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. పట్టణంలోని మహారాష్ట్ర వీధిలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో సామూహిక సింధూరార్చన, 516 మామిడి పండ్లతో విశేష అర్చన నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శతనామావళి, హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం విజయ నరసింహాచార్యులు పూజలు నిర్వహించారు. పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో ఆంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని మేదర మహేంద్ర సంఘం రామాలయం వద్ద ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. పట్టణ సీఐ ఎస్.నాగమల్లేశ్వరరావు ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. పాత బస్టాండ్‌లో ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించి అన్నసంతర్పణ చేపట్టారు. అలాగే పట్టణంలోని వడ్డవల్లి వీరాంజనేయస్వామి దేవాలయంలో, నాగార్జుననగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో, గుంటూరు రోడ్‌లోని వాసవినగర్‌లో పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.




సత్తెనపల్లిలోని హనుమాన్ శోభాయాత్రలో భక్తులు


గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నాయుడు సాంబశివరావు, ఏకుల అన్నపాములును అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు




దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డిని అభినందించిన మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



సందెపోగు పున్నారావును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి/బెల్లంకొండ/అచ్చంపేట/క్రోసూరు : వైఎస్సార్‌సీపీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయటానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గురువారం మల్లాదిలో ఇటీవల నియోజవర్గంలోని మండలాల నుంచి జిల్లా స్థాయిలో పదవులు పొందిన నాయకుల అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ పార్టీకి సేవలు అందించిన వారందరికి తగు న్యాయం జరుగుతుందన్నారు. పదవులు పొందిన వారు గ్రామ స్థాయిలో కార్యకర్తలకు నాయకులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికలలో జననేత జగన్‌మోహన్ రెడ్డిని సీఎంను చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు నాయుడు సాంబశివరావును, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఏకుల అన్నపాములును, అలాగే అచ్చంపేట మండలానికి చెందిన జిల్లా పార్టీ జనరల్ సెక్రటరీ కొమరాల రమేష్‌ను శాలువాలతో సత్కరించి అభినందించారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నాయుడు సాంబశివరావును, ఏకుల అన్నపాములును అభినందించారు.

- బెల్లంకొండ మండలంలోని చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు గాదెమిల్లు వెంకటరెడ్డిని పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా మండలంలోని పార్టీ నాయకులతో కలసి వెంకటరెడ్డి నంబూరు శంకరరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వెంకటరెడ్డిని శాలువాతో సత్కరించారు.
- వైఎస్సార్‌సీపీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందనడానికి అచ్చంపేట మండలం నుంచి జిల్లా కమిటీలో స్థానం సాధించిన కొమరాల రమేష్, సందెపోగు పున్నారావులే నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఈ సందర్భంగా రమేష్, పున్నారావులను శాలువాలతో మాజీ ఎమ్మెల్యే శంకరరావు అభినందించారు.
- పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ కమిటీ సభ్యులుగా నియమితులైన మండలంలోని గాదెవారిపాలెం గ్రామానికి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి గురువారం మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావును కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గౌరవం దక్కుతుందన్నారు. అందుకు ఇటీవల నియమితులైన జిల్లా పార్టీ కమిటీ సభ్యులే నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా నియోజవర్గంలోని మండలాల నుంచి జిల్లా స్థాయిలో పదవులు పొందిన వారు మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ అయోధ్యరామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ శాసనసభ్యుడు నంబూరు శంకరరావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు అలా లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా మండలాల్లోని ప్రముఖ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



గాదె వెంకటరెడ్డి సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకరరావు, పార్టీ నాయకులు